అభివృద్ధి పనులకు సహకరించండి..

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శనివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో సీసీరోడ్లు, నూతన కమ్యూనిటీ భవనాలు, తదితర అభివృద్ధి పనులకు సహకరించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.
– వ్యవసాయ యూనివర్సిటీ

యూకేలో వృత్తి, విద్యావకాశాలపై సదస్సు

ఖైరతాబాద్, ఆగస్టు 3 : గ్లోబల్ ట్రీ, నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అల్యుమ్నీ సంయుక్తాధ్వర్యంలో యూకేలో వృత్తి, విద్యావకాశాలపై శనివారం విల్లా మేరీ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకులు శ్రీకర్ ఆలపాటి, నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అల్యుమ్నీ యూకే చైర్ పర్సన్ సనమ్‌ఆరోరా, విల్లా మేరీ కళాశాల ప్రిన్సిపాల్ రేవతి మతూర్ పాల్గొని విద్యార్థులకు విదేశాల్లో విద్య అవకాశాలు, విశ్వవిద్యాలయాల వివరాలు, కేరీర్, వీసా ప్రక్రియలపై అవగాహన కల్పించారు.

రిజర్వాయర్ ఏర్పాటుతో నీటి సమస్యలకు చెక్

రహ్మత్‌నగర్ డివిజన్, ఎస్‌పీఆర్ హిల్స్‌లో చేపడుతున్న రిజర్వాయర్ పనులను శనివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పరిశీలించారు. పనులు తుది దశకు చేరుకున్నాయని, అందుబాటులోకి వస్తే ప్రజలకు నీటి సమస్యలు ఉండవన్నారు. – జూబ్లీహిల్స్

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను విజయవంతం చేయాలి

• అధికారులకు నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్ ఆదేశం

మణికొండ, ఆగస్టు 3: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ వివరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై వివిధ శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 9వరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని ప్రతి డివిజన్‌లో నిర్వహించాలన్నారు. ఇందులో ప్రజలను భాగస్వాములను చేస్తూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్

ప్రభుత్వ పాఠశాలలకు చేయూత అభినందనీయం

కోకాపేట్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మణికొండ, ఆగస్టు 3: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకువచ్చి మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని నార్సింగి మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాల విజయ్‌బాబు అన్నారు. కోకాపేట్ ప్రభుత్వ పాఠశాలలో ఫ్రాంక్లీ టెంపుల్, ఇండియా రౌండ్ టేబుల్ వారి సహకారంతో అదనంగా నిర్మించిన తరగతి గదులను శనివారం ఆయన ఫ్రాంక్లిన్ టెంపుల్, రౌండ్ టేబుల్ ప్రతినిధి శ్రీనివాస్ బిరుదుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం స్వచ్ఛంద సంస్థలు చేయూతను అందించడం అభినందనీయమన్నారు. సేవలందిస్తున్న ఫ్రాంక్లిన్, రౌండ్ టేబుల్ సంస్థలకు తామంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అశీష్ బట్టాచార్య, అజయ్ ముదాలి, నాగలక్ష్మి, హరీశ్, సేతు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలివేలు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ యాదగిరి, నాయకులు ఆర్.విశ్వనాథ్, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

ఆదర్శ్‌నగర్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్‌నగర్, ఆగస్టు 3: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. శనివారం ఆదర్శ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతతో కలిసి 38 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని, పేద, మధ్య తరగతి ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్‌ఎఫ్ నిధులతో పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం లభిస్తుందన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రాజీవ్ గృహకల్పలో ప్రజలతో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 3: మాదకద్రవ్యాల కారణంగా అనేక కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ప్రజలు వాటికి దూరంగా ఉండాలని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ అన్నారు. స్టేషన్ పరిధిలో శనివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లక్ష్మీగూడ, రాజీవ్‌గృహకల్ప, పింక్ బిల్డింగ్ ఫేజ్-2లోని సముదాయాల్లోని కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. నిషేధిత గుట్కా, గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రోజురోజుకు మాదకద్రవ్యాల వాడకం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మద్యం, సిగరెట్, డ్రగ్స్, గుట్కా ఇలా అనేక రకాల వ్యసనాలకు బానిసలవు తున్నారని అన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. విద్యార్థులు సైతం వీటివైపు మొగ్గు చూపుతున్నారన్నారు. మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా వాడుతున్నట్లు తెలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫాగింగ్

జూబ్లీహిల్స్, ఆగస్టు 3 : దోమలు విజృంభించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. శనివారం దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఫాగింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. దోమల నివారణ కరపత్రాలను పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.వెంకటి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 3 : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు శనివారం తన నివాసం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు వైద్య సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5,50,500 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. తెలంగాణలోని పేదవర్గాలకు వైద్యపరమైన సహకారం అందించి,వారికి అండగా ఉంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గణేశ్‌గుప్తా, చంద్రారెడ్డి, రాజుముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, సతీశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, రాజ్‌కుమార్, రాంగోపాల్, సహకార సంఘం చైర్మన్ దావణాకర్‌గౌడ్, వైస్ చైర్మన్ ప్రభుసాగర్, మల్లికార్జున్, ప్రభాకర్‌గౌడ్, చంద్రశేఖర్, అచ్యుత్ పాల్గొన్నారు.

మేడారంలో మొక్క ముడుపు పండుగ

సామాజిక పర్యావరణ శాస్త్రవేత్త అనిల్ కుమార్

జి.అనిల్ కుమార్‌కు మొక్కను బహూకరిస్తున్న ఎం.సూర్య నారాయణ, తదితరులు

ఖైరతాబాద్, ఆగస్టు 3: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న ''ఆదివాసీలు, అడవుల రక్షణ, గిరిజనుల పండుగలు, కాలుష్య కోరల్లో అటవీ ప్రాంతం, సుస్థిర మేడారం'' తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని కార్యక్రమ నిర్వాహకులు, సామాజిక పర్యావరణ శాస్త్రవేత్త అనిల్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మినీ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారంలో ప్రతి రెండేండ్లకు ఓసారి కోట్లాదిగా భక్తులు వస్తుంటారని, అయితే అక్కడ వన భోజనాల మాటున ప్లాస్టిక్ లాంటి కాలుష్య కారకాలను అక్కడే వదిలి వెళ్తారన్నారు. ఫలితంగా జీవ వైవిధ్యం దెబ్బతిని, భూమి, గాలి, నీరు కలుషితం అవుతున్నాయన్నారు. ఆ క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 9న మేడారంలో 150 ఎకరాల్లో సుస్థిర మేడారం థీమ్‌తో ప్లాంటేషన్ ఫెస్టివల్ (మొక్క ముడుపు పండుగ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్థానికులను భాగస్వాములను చేసి వన భోజనాలను పర్యారణ హితంగా నిర్వహిస్తామని, అనంతరం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. తద్వారా 150 ఎకరాల్లో పచ్చదనం వెల్లివిరుస్తుందన్నారు. అలాగే, నగరాల్లోని అపార్టుమెంట్లలో నివసించే వారు అటవీ ప్రాంతాలు, గ్రామాలకు వెళ్లి అక్కడ పర్యావరణ హితంగా వనభోజనాలు ఏర్పాటు చేసుకోవాలని, అనంతరం, మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నవీన్ శ్రీరామ్, సుధీర్ ఆలం పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలు..

మాదాపూర్ : అన్నమాచార్య బావన వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో అన్నమయ్యపురం విద్యార్థులతో సంకీర్తనలు, నృత్య కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమం శ్రీవాగ్దేవి నాట్యస్థల్ వారి నృత్యార్చనతో ప్రారంభమైంది. గురువు శైలజ వడ్లానం వారి శిష్య బృందం సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. డాక్టర్ శోభరాజు కళాకారులకు శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు.

విద్యార్థుల ఫీజుల చెక్కులు అందజేత

ఫీజు చెక్కులు అందజేస్తున్న వీఆర్4సహాయోగ్ ట్రస్ట్ సభ్యులు

మణికొండ, ఆగస్టు 3: పేద విద్యార్థుల చదువుకు తోడ్పాటు అందిస్తున్నామని వీఆర్4 సహాయోగ్ మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్‌రావు అన్నారు. వీఆర్4సహాయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైతన్య కాలేజీలో చదువుతున్న విద్యార్థినులు పూజా సింగ్, చక్రికలకు సంబంధించి రెండవ విడత సంవత్సరం పూర్తి ఫీజును కాలేజీ యాజమాన్యంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డుకాకుడదనే ఉద్దేశంతో వీఆర్4సహాయోగ్ ఆధ్వర్యంలో చేయూతనందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిట్లు పద్మారావు, ఆలస్యం నవీన్ కుమార్, ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కార్యదర్శి షేక్ ఆరీఫ్ మొహమ్మద్, ఉపాధ్యక్షుడు బొమ్ము ఉపేంద్ర నాథ్‌రెడ్డి, కోశాధికారి దిలీప్ కక్కడ్, కల్చరల్ కార్యదర్శి నరోత్తంసింగ్, తమ్మిశెట్టి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : కౌన్సిలర్

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ నవీన్‌కుమార్

మణికొండ, ఆగస్టు 3: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ ఆలస్యం నవీన్‌కుమార్ అన్నారు. జయశంకర్ పార్కు నుంచి డిఫెన్స్ కాలనీ ప్రధాన రోడ్డు వరకు రూ.37 లక్షల మున్సిపాలిటీ సాధారణ నిధులతో చేపట్టే పనులను శనివారం ఆయన సహ కౌన్సిలర్ పద్మారావుతో కలిసి ప్రారంభించారు. ఎనిమిదో వార్డు పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను దగ్గరుండి పరిశీలించిన అనంతరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అల్కాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని పలు భవన నిర్మాణాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, వీటిపై సంబంధిత అధికారులు నిఘా పెట్టాలని కోరారు. ఇటీవల ఓ భవన నిర్మాణం పూర్తి చేసుకున్న తరువాత నిరభ్యంతర సర్టిఫికెట్ జారీ చేయకుండా విద్యుత్‌శాఖ అధికారులు ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇలాంటి అక్రమాలపై తాను నిరంతరం పోరాటంతోనే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు.

ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ పద్మారావు, కాలనీ వాసులు విశ్వనాథ్, వెంకటేశ్వర్లు, ప్రమోద్, నవీన్, సావుద్దీన్, ఆరీఫ్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుల కృషి మరువలేనిది



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 3: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ఉపాధ్యాయులు ఎనలేని కృషి చేస్తున్నారని నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, బాబుల్‌రెడ్డినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 13 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు జంగయ్య, ప్రదీప బదిలీ అయ్యారు. శనివారం పాఠశాల ఆవరణలో వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనితతో కలిసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఏ పాఠశాలకు వెళ్లినా అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయుల వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్‌ఎల్‌బీ కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను ఈనెల 10 తరువాత తీసుకోవాలని సూచించారు. రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చెల్లించి, ఈనెల 17లోగా ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చెల్లించి ఈనెల 31లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osma nia.ac.in లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) ఎనిమిదో సెమిస్టర్, బీఈ (సీబీసీఎస్) ఎనిమిదో సెమిస్టర్, బీఈ (నాన్ సీబీసీఎస్) నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ మేకప్, బ్లాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫీజును ఈనెల 12లోగా చెల్లించాలని చెప్పారు. పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా వర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ, పీఎస్‌వై డీ క్లినికల్ సైకాలజీ, ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ క్లినికల్ సైకాలజీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సర్వత్రా సంబురాలు

యూసుఫ్‌గూడ బస్తీ కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సంబురాలు జరుపుకుంటున్న దళిత నాయకులు

ప్రతాప్‌నగర్ బస్తీలో మిఠాయిలు పంచుకుంటున్న టీఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

జూబ్లీహిల్స్, ఆగస్టు 3 : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ తీర్పు చారిత్రాత్మకమని దళిత నాయకులు అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ అంబేద్కర్ సర్కిల్, లక్ష్మీనరసింహనగర్‌లో 'మాదిగ బలగం సంబురాలు' పేరిట వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను పూలమాలలతో అలంకరించి స్వీట్లు పంచారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఎల్ ప్రకాశ్, నర్సింగ్‌దాస్, రామారావు, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, యాద య్య, వెంకటస్వామి, వెంకటేశ్, స్వామి, రా మలింగం, శివకుమార్‌దాస్, శాంతికుమార్, కన్ని పైల్వాన్, నాగ, గోపాల్, పవన్‌కుమార్, మహేశ్‌బాబు, బిట్టు, సందీప్, వెంకటేశ్, సాయి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో..

ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఆయా వర్గాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. శనివారం వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లో టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. పంజాగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీలో టీఎమ్మార్పీఎస్ యువజన విభాగం అధ్యక్షుడు నల్ల శివ మాదిగ నాయకత్వంలో అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రజినీకాంత్, సురేశ్, యాకరి గణేశ్, రాము, రమేశ్, నరహరి, మహేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

హిమాయత్‌నగర్, ఆగస్టు 3: ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన శనివారం నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై షఫీ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగూడ శాంతి థియేటర్ ముందు ఉన్న బస్టాప్ ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వృద్ధుడు (65) అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని 108కు సమాచారం అందించారు. వైద్య సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. అనారోగ్యం కారణంగానే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 040- 27852579ను సంప్రదించాలని సూచించారు.

కళా సదస్సును విజయవంతం చేయండి

జగద్గిరిగుట్ట : కళాకారుల సమస్యల పరిష్కారానికి 7న రవీంద్రభారతిలో కళాసదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రజా నాట్యమండలి ప్రతినిధులు తెలిపారు. శనివారం జగద్గిరిగుట్టలో సమావేశమై కరపత్రాలు పంచారు. సదస్సులో రాయితీలు, గుర్తింపు కార్డులు, ఉద్యోగం, పింఛన్, ఇంటిస్థలం సాధించడంపై చర్చిస్తారు. కళాకారులు, ప్రజాసంఘాల నేతలు సదస్సుకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, రాములు, అక్షిత, సదానందం, సాయిలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 3 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం శంషాబాద్ మున్సిపాలిటీలోని తొండుపల్లి ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. గతంలో రంగారెడ్డి జిల్లా కూరగాయల జోన్‌గా ప్రకటిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ బలోపేతం కోసం నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా కష్టపడి ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు నందకిశోర్, రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్,మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్, ఆచారి, కేఎస్ రత్నం, అంజన్‌కుమార్‌గౌడ్, రాజ్‌భూపాల్‌గౌడ్, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

అపోలోలో నలుగురు బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు పునర్జన్మ



అపోలో హాస్పటల్ మరొక మైలురాయిని సొంతంచేసుకుంది. నలుగురు బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు విజయవంతంగా మెకానికల్ థ్రోంబెక్టమీ ప్రొసీజర్ నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు అపోలో వైద్యులు. ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సురేశ్ గిరగాని, న్యూరాలజిస్ట్‌లు డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజేశ్ రెడ్డి, డాక్టర్ సందీప్ నాయని, డాక్టర్ యశ్వంత్‌లతో పాటు ఎమర్జెన్సీ ఫిజీషియన్లు, న్యూరో అనస్థీషియన్లు, స్పెషలైజ్డ్ నర్సింగ్ స్టాఫ్ నిర్విరామంగా శ్రమించి నలుగురు రోగులకు విజయవంతంగా చికిత్స నిర్వహించారు. 24 గంటలు శ్రమించి ఆ నలుగురు రోగులకు చికిత్స అందించగా వారిలో ముగ్గు రు 74 ఏండ్లకు పైబడిన వారు కావడం విశేషం.
– జూబ్లీహిల్స్, ఆగస్టు 3

విద్యార్థులకు వాక్సినేషన్

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టీకాలు ఇస్తున్న వైద్య సిబ్బంది

జూబ్లీహిల్స్, ఆగస్టు 3 : మెదడువాపు వ్యాధి నివారణకు ప్రభుత్వ పాఠశాలల్లో జేఈ వాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం బంజారాహిల్స్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టి విద్యార్థులకు టీకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగకార్తిక్, డిప్యూటీ ఐఓఎస్ , హెచ్‌ఎం కొర్స యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

హిమాయత్‌నగర్,ఆగస్టు3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైందని హిమాయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నేత పాలడుగు శ్రీనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశంను పరిష్కరిస్తూ తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. సామాజిక న్యాయం పూర్తిగా అందరికీ దక్కడంలో వివక్షతకు తావు లేకుండా చేయడంలో ఈ తీర్పు ఉపకరిస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన ధర్మ ఉద్యమంలో అమరులైన మాదిగ వీరులకు ఈ విజయం అంకితం చేస్తున్నామని తెలిపారు. మాదిగజాతి అభివృద్ధికి దోహదపడే వర్గీకరణ కోసం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఎంతోమంది మాదిగలు ఉద్యమంలో భాగస్వాములైనవారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సర్కారు పాఠశాలలో సకల వసతులు

మియాపూర్, ఆగస్టు 3 : ప్రభుత్వ పాఠశాలను సౌకర్యాల పరంగా తీర్చిదిద్దుతామని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. హైదర్‌నగర్‌లో కోటి నిధులతో ఎంపీపీఎస్ పాఠశాల పునరుద్ధరణ నిర్మాణ పనుల్లో భాగంగా బోర్‌వెల్ పనులను కార్పొరేటర్ శనివారం ప్రారంభించారు. జలవాయు విహార్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.